క్లుప్తంగా

జల్లికట్టు నిర్వహిస్తే చర్యలు



కొటాల గ్రామస్తులకు కౌన్సిలింగ్ ఇస్తున్న తహసీల్దార్, ఎస్ఐ

యాదమరి: మండలంలోని కొటాల గ్రామంలో జల్లికట్టు నిర్వహించరాదని తహసీల్దార్ హనుమంతు, ఎస్ఐ సుమన్ గ్రామస్తులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. గ్రామంలో ఈ నెల 4న ముత్యాలమ్మ జాతర సందర్భంగా 5వ తేదీ జల్లికట్టు నిర్వహిస్తున్నట్లు కరపత్రాలు ముద్రించారని తెలిపారు. గ్రామంలో జల్లికట్టు నిర్వహించడానికి అనుమతి లేదని, గ్రామస్తులు చట్టాన్ని ఉల్లంఘించి జల్లికట్టు నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అందరూ సహకరించాలని కోరారు.

అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి



మాట్లాడుతున్న ఎస్ఐ రాజశేఖర్

గుడిపాల: గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలపై గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శులు దృష్టి సారించాలని గుడిపాల ఎస్ఐ రాజశేఖర్ అన్నారు. సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మండలంలోని మహిళా కార్యదర్శులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో పర్యటించి మహిళలు, యువతులపై జరిగే దాడులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. మహిళా భద్రతకు ప్రభుత్వం తీసుకొచ్చిన దిశ చట్టాలపై గ్రామాల్లో మహిళలు, యువతుల్లో అవగాహన కల్పించాలన్నారు. గడపగడపకు మన పోలీస్ కార్యక్రమాన్ని ప్రతి ఇంటికీ వెళ్లి తెలియజేయాలని సూచించారు. ప్రతి మహిళ ఫోన్‌లో దిశ యాప్‌ను డౌన్‌లోడ్ చేయించాలని తెలిపారు.

స్పందనకు 19 అర్జీలు

చిత్తూరు రూరల్: నగరంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. డీటీ కిరణ్ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. రోడ్డు, సర్వే, ఇంటి పట్టాలు, మ్యూటేషన్, రేషన్‌కార్డు సమస్యలకు సంబంధించి మొత్తం 19 అర్జీలు వచ్చాయి. వాటిని పరిశీలించి సమస్యలను పరిష్కరించేలా చూడాలని వీఆర్‌ఓలకు ఆయన ఆదేశించారు.

రైతులకు చాప్‌కట్టర్‌లు అందజేత



చాప్‌కట్టర్‌లతో అధికారులు, రైతులు

పూతలపట్టు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో మండలంలోని పలువురు రైతులకు సోమవారం రాయితీపై చాప్‌కట్టలను పంపిణీ చేశారు. ఎంపీడీఓ గౌరి, వైస్ ఎంపీపీ ద్వారకనాథరెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా పశువర్ధకశాఖ సహాయ సంచాలకులు గీతారెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అన్ని విధాలుగా అండగా ఉంటోందన్నారు. చాప్‌కట్టర్ విలువ రూ. 33,970 ఉండగా ప్రభుత్వం 40 శాతం సబ్సిడీ అందిస్తోందని తెలిపారు. మండలానికి మొత్తం 57 చాప్‌కట్టర్‌లు వచ్చినట్లు చెప్పారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గౌరి, వైస్ ఎంపీపీ ద్వారకనాథరెడ్డి, మణి, బాలాజీ, వైద్యులు దీపాని, శివరాజ్ పాల్గొన్నారు.

జేబు దొంగకు జైలు

తిరుపతి లీగల్: తిరుమలలో ఓ వ్యక్తి జేబులోని సొమ్మును చోరీ చేసిన కేసులో కృష్ణా జిల్లా పోరంకి మండలం తుషానం కట్టకు చెందిన డి.గోపికి రెండు నెలల జైలు శిక్ష, రూ.100 జరిమానా విధిస్తూ తిరుపతి రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి పల్లపోలు కోటేశ్వరరావు సోమవారం తీర్పు చెప్పారు. ఈ ఏడాది జూన్ 19వ తేదీన విశాఖపట్నం జిల్లాకు చెందిన యాకూబ్ తిరుమల రెండో వైకుంఠం క్యూ కాంప్లెక్స్ వద్ద ఉన్నాడు. అతని ప్యాంట్ జేబులోని రూ.9,500 చోరీకి గురైంది. అతని ఫిర్యాదు మేరకు తిరుమల ఒన్ టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేసి నిందితుడు గోపి, మరొకరిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు. నిందితుడు గోపి నేరం అంగీకరించడంతో న్యాయమూర్తి అతనికి శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

గాయపడిన వ్యక్తి మృతి

భాకరాపేట : రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు భాకరాపేట ఎస్ఐ ప్రకాష్‌కుమార్ తెలిపారు. భాకరాపేట సమీపంలోని నెమిలిగుండ్ల వద్ద ఉన్న మెగా కంపెనీలో ఆపరేటర్‌గా పని చేస్తున్న ముఖేషచౌదరి(37) ఆదివారం రాత్రి కార్యాలయానికి నడుచుకుంటూ వెళుతుండగా పీలేరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొంది. తీవ్రంగా గాయపడిన అతన్ని కంపెనీకి చెందిన కార్మికులు, పోలీసులు 108లో తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. అక్కడ అతను సోమవారం ఉదయం మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గడపగడపకూ సంక్షేమం

- లంచాలకు తావులేకుండా సంక్షేమ పథకాలు
- పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు



సంక్షేమ బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్‌బాబు

పూతలపట్టు: లంచాలకు తావు లేకుండా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గడపగడపకు సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. సోమవారం పూతలపట్టు పంచాయతీలోని పీసీ యల్లంపల్లి, మిట్టపాళ్యం, ఎస్టీ కాలనీ, బత్తలవారిపల్లి, అనంతాపురం, సామనాత్తం హరిజనవాడ, సామనాత్తం గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఆయనకు ఆయా గ్రామాల ప్రజలు ఘన స్వాగతం పలికారు. ముందుగా దివంగత మాజీ వైస్ ఎంపీపీ సుబ్బారెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు.

అనంతరం ఎమ్మెల్యే ఎంఎస్ బాబు ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. లబ్ధిదారులకు బుక్‌లెట్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలో పేదల అభ్యున్నతి కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం లంచాలకు, వివక్షలకు తావులేకుండా.. కార్యాలయాల చుట్టూ తిరిగే దుస్థితి లేకుండా గ్రామ, వార్డు సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా అత్యంత పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నట్లు తెలిపారు. జగనన్న మేనిఫెస్టోలోని ప్రతి హామీని అమలు చేసి ప్రజల గుండెల్లో దేవుడిగా నిలిచిపోయారని తెలిపారు. నాలుగు తరాలు గుర్తుపెట్టుకునే విధంగా సీఎం పాలన సాగుతుంటే 14 ఏళ్లు సీఎంగా ఉన్న చంద్రబాబునాయుడు ఎన్ని రకాలమోసాలు చేశారో ప్రజలు గ్రహించాలన్నారు.

ఎమ్మెల్యే దృష్టికి పలు సమస్యలు

గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో స్థానికులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. తాగునీరు, డ్రైనేజీ, విద్యుత్ సరఫరా తదితర సమస్యలను విన్నవించారు. ఆయా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. సమస్యలు లేని నియోజకవర్గంగా పూతలపట్టును తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. అలాగే వివిధ కారణాల వల్ల సంక్షేమ పథకాలు అందనివారి వివరాలను అధికారులు తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గౌరి, తహసీల్దార్ విజయభాస్కర్, సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ సురేష్, జెడ్పీటీసీ సభ్యురాలు దేవిక, వైస్ ఎంపీపీ ద్వారకనాథరెడ్డి, సర్పంచ్ మాసిలామణి, వైస్ సర్పంచ్ బాబురెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు లావణ్య, పార్టీ నాయకులు బాబురెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, జయచంద్రారెడ్డి, ఖాదర్‌వల్లి, రాజారత్నంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గజమాలతో స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

నేడు పూతలపట్టు–2లో గడపగడపకు మన ప్రభుత్వం

పూతలపట్టు పంచాయతీ–2లో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీఓ గౌరి తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే ఎంఎస్ బాబు హాజరుకానున్నట్లు తెలిపారు. మండల అధికారులు, ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తప్పక హాజరు కావాలన్నారు.

‘స్పందన’ వినతులకు సత్వర పరిష్కారం



అర్జీదారులతో మాట్లాడుతున్న కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్: స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చే వినతులను వేగంగా పరిష్కరించాలని నగర కమిషనర్ జె అరుణ అధికారులను ఆదేశించారు. సోమవారం నగర పాలక కార్యాలయంలో స్పందన కార్యక్రమం జరిగింది. ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అర్జీలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, వినతులపై శాఖాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. గతవారం అందిన వినతులు, పరిష్కరించిన వాటి వివరాలపై సమీక్షించారు. ఇంజినీరింగ్– 5, ప్రజారోగ్యం –2, టీపీఓ– 2, రెవెన్యూ ఒకటి చొప్పున మొత్తం పది వినతులు అందాయి. కార్యక్రమంలో సహాయ కమిషనర్ గోవర్ధన్, ఎంఈ వెంకట ప్రసాద్, ఎంహెచ్ఓ లోకేష్ పాల్గొన్నారు.

కాణిపాకానికి పోటెత్తిన భక్తులు



భక్తులతో నిండిపోయిన క్యూలు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి ఆలయానికి సోమవారం భక్తులు పోటెత్తారు. మంగళవారం పౌర్ణమి సందర్భంగా తిరువణ్ణామలై కొండచుట్టుకు వెళ్లే శివయ్య భక్తులు ముందుగా గణనాథుడిని దర్శించుకోవడానికి తరలిరావడంతో ఆలయ పరిసరాలు కిక్కిరిశాయి. వాహనాలతో పార్కింగ్ స్థలాలు నిండిపోయాయి. క్యూలైన్లు నిండిపోయి ఆలయం వెలుపుల వరకు బారులు తీరారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు.

చెడు అలవాట్లతో జీవితాలను నాశనం చేసుకోవద్దు





విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న జడ్జి కరుణకుమార్, హాజరైన విద్యార్థులు

–జడ్జి కరుణకుమార్

బంగారుపాళెం: యువత చెడు అలవాట్లకు బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, జడ్జి కరుణకుమార్ అన్నారు. మాదక ద్రవ్య వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం స్థానిక విజ్ఞాన్ డిగ్రీ కళాశాలలో చిత్తూరు రూరల్ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. జడ్జి కరుణకుమార్ మాట్లాడుతూ.. దేశ భవిష్యత్తు యువతరంపై ఆధారపడి ఉందన్నారు. అలాంటి యువత మాదకద్రవ్యాలైన కొకైన్, హెరాయిన్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు అలవాటుపడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. డ్రగ్స్ రహిత సమాజాన్ని తీసుకొచ్చేలా యువత పాటుపడాల్సిన అవసరం ఉందన్నారు. చెడుదారిలో పయనించే యువత సమాజానికి ప్రమాదకరమన్నారు. బాగా చదువుకుని సమాజంలో మంచి పౌరులుగా మెలగాలని సూచించారు. సెబ్ సీఐ చంద్రశేఖర్ మాట్లాడుతూ.. మత్తు పదార్థాల అక్రమ రవాణా చట్టవ్యతిరేకమన్నారు. డ్రగ్స్ అక్రమ రవాణా చేసేవారిపై కఠిన చర్యలు ఉంటాయన్నారు. కళాశాల ప్రిన్సిపల్ వెంకటాచలం మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని భవిష్యత్తులో ప్రయోజకులుగా ఎదిగి తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ బెన్నురాజ్, సెబ్ ఎస్ఐ మోహన్‌బాబు, హెచ్‌సీ కృష్ణయ్య, కానిస్టేబుళ్లు వెంకటేష్, రేఖ, కిరణ్ పాల్గొన్నారు.

అన్నదానం మహోన్నతం



అన్నదానం చేస్తున్న జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్: అన్నదానం మహోన్నతం అని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు అన్నారు. కలెక్టరేట్ ప్రాంగణంలో సోమవారం జేపీ వెల్‌నెస్ ఫౌండేషన్, స్వామి వివేకానంద ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ.. ప్రతి సోమవారం జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి కలెక్టరేట్‌కు ప్రజలు విచ్చేస్తారన్నారు. స్పందన కార్యక్రమంలో ప్రభుత్వం తరఫున అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. ప్రజలు ఆకలితో వెళ్లకూడదనే ఉద్దేశంతో ఫౌండేషన్ సభ్యులు అన్నదానం చేయడం అభినందనీయమన్నారు. అనంతరం ప్రజలకు జేసీ చేతుల మీదుగా అన్నదానం చేశారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ రాజశేఖర్, జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, మైనారిటీ సంక్షేమశాఖ అధికారి చిన్నారెడ్డి, ఫౌండేషన్ సభ్యులు జయప్రకాష్, జయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేటి కార్యక్రమాలు

పింఛన్ల పంపిణీ

చిత్తూరు రూరల్: చిత్తూరు మండలంలో మంగళవారం నుంచి సామాజిక పింఛన్లను పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి తెలిపారు. లబ్ధిదారుల ఇంటి వద్దకే పింఛన్లు అందజేస్తారన్నారు. లబ్ధిదారులు వలంటీర్లకు అందుబాటులో ఉండి పింఛన్ సొమ్ము 5 రోజుల్లోపు తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

తిరుపతిలో ర్యాలీ

చిత్తూరు కార్పొరేషన్: విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం మంగళవారం తిరుపతిలో ర్యాలీ నిర్వహించనున్నట్లు విద్యుత్ ఉద్యోగుల జేఏసీ డివిజన్ అధ్యక్షుడు గోవిందన్ తెలిపారు. ర్యాలీ ఉద్యోగులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. 2, 3 తేదీల్లో రిలే నిరహారదీక్ష ఉంటుందని వివరించారు.

సత్యనారాయణ వ్రతం

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి అనుబంధ ఆలయమైన వరదరాజులస్వామి ఆలయంలో మంగళవారం సత్యనారాయణ వ్రతం నిర్వహించనున్నట్లు దేవస్థానం చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశు తెలిపారు. పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి వ్రతం నిర్వహించనున్నామని చెప్పారు. రాత్రి స్వామివారికి గరుడ సేవ జరుగుతుందన్నారు.

అర్ధగిరి క్షేత్రంలో పౌర్ణమి వేడుకలు

తవణంపల్లె: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీవీరాంజనేయస్వామి దేవస్థానంలో మంగళవారం పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహిస్తామని ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ పైమాఘం సురేంద్రరెడ్డి, ఆలయ ఈఓ వెంకటసుబ్బారెడ్డి తెలిపారు. ఉదయం స్వామికి అభిషేకం, ప్రత్యేక అలంకరణ, అర్చనలు, పూజలు నిర్వహిస్తామన్నారు. 11 గంటలకు సుదర్శన హోమం జరుగుతుందన్నారు. రాత్రి ప్రాకారోత్సవం నిర్వహిస్తామని తెలిపారు. రాత్రి భక్తుల కాలక్షేపం కోసం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

ఖాళీలను భర్తీ చేయాలి

చిత్తూరు కార్పొరేషన్: ట్రాన్స్‌కో పరిధిలో ఉన్న ఖాళీలను భర్తీ చేయాలని విద్యుత్ ఉద్యోగుల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో భాగంగా సోమవారం గాంధీవిగ్రహానికి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు యజ్ఞేశ్వరరావు, శేషాద్రి, రాజేంద్రబాబు, గౌతంరాజా, కరీముల్లాఖాన్, నీరజ, రవిచంద్రన్, పరంధామరెడ్డి, హరి, వివేకానందరెడ్డి, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత

చిత్తూరు అర్బన్: చిత్తూరు శివారులోని మాధవరంలో ఎస్ఈబీ అధికారులు అక్రమ మద్యం విక్రయాలపై సోమవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో కర్ణాటక మద్యం 15 బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. అమవాస్య (46) అనే మహిళను అదుపులోకి తీసుకున్నారు. సీఐ జోగేంద్ర, ఎస్ఐ బాబు, పృథ్వీ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి ముంగిటే సేవలు



లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మేయర్ అముద

చిత్తూరు అర్బన్: వార్డు దాటకుండా ప్రజా సేవలను ప్రభుత్వం దగ్గర చేసిందని, దీంతో సంక్షేమ పథకాలు, సేవలను ప్రజలు సులభతరంగా పొందుతున్నారని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. చిత్తూరులోని టి.చవటపల్లి సచివాలయంలో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యేతో కలిసి మేయర్ అముద, డిప్యూటీ మేయర్లు చంద్రశేఖర్, రాజేష్‌కుమార్‌రెడ్డి, చుడా చైర్మన్ పురుషోత్తంరెడ్డిలు పలువురికి సర్టిఫికెట్లు అందజేశారు. ప్రజలకు అవసరమైన సేవలను అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం పారదర్శకతను పాటిస్తోందన్నారు. ఈ సేవల్లో ఇబ్బందులుంటే అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకురావచ్చన్నారు. వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

గణనాథుని సేవలో ప్రముఖులు



నటుడు తనికెళ్ల భరణికి ప్రసాదాలు అందజేస్తున్న ఆలయాధికారులు



జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయరెడ్డికి స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఆలయ చైర్మన్

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామిని సినీ రచయిత, నటుడు తనికెళ్ల భరణి, జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయ రెడ్డి సోమవారం వేర్వేరుగా దర్శించుకున్నారు. వారికి ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఆలయ ఇన్‌స్పెక్టర్ బాబు, అధికారులు స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం ఆశీర్వాద మండపంలో వేదపండితులతో ఆశీర్వచనం అందించి స్వామివారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలు అందించారు. జెడ్పీ వైస్ చైర్మన్‌తో స్థానిక సర్పంచ్ శాంతిసాగర్ రెడ్డి, నాయకులు చిన్నారెడ్డి, రవిరెడ్డి, పుణ్యసముద్రం రవి, సుధీర్, మనోహర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

జెడ్పీ వైస్ చైర్మన్‌కు శుభాకాంక్షలు

జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయరెడ్డికి పలువురు సోమవారం జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానంద రెడ్డి, ప్రముఖ పారిశ్రామిక వేత్త బీఎంఆర్ సంస్థల అధినేత మోహన్‌రెడ్డి, ఎస్‌ఆర్‌ఐ హరిబాబు రెడ్డి తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా యాదమరి, తపోవనంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

మంగళ విద్యావాణి మాసపత్రిక ఆవిష్కరణ



సంచికను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

బంగారుపాళెం: మండలంలోని మంగళపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ×మంగళ విద్యావాణి¥ 22వ సంచికను ఆవిష్కరించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం విశ్రాంత ప్రొఫెసర్ రాధాకృష్ణారెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాజ్యలక్ష్మి, ఉపాధ్యాయులు సంచికను ఆవిష్కరించారు. అనంతరం కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. పాఠశాల ఉపాధ్యాయులు ఐదేళ్లుగా పాఠశాల తరఫున మంగళవిద్యావాణి మాసపత్రికను నడపడం అభినందనీయమన్నారు. మాస పత్రికలో కథలు, కవితలు, వ్యాసాలు, విద్యారంగానికి సంబంధించిన వ్యాసాలను విద్యార్థులతో రాయించి వారిలో సృజనాత్మకతను పెంపొందిం చేందుకు చేస్తున్న కృషిని ప్రశంసించారు. మాసపత్రిక సంపాదకుడు అరుణ్ శివప్రసాద్ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో పఠనా నైపుణ్యాలు, వ్యాసరచనా శక్తిని పెంపొందించేందుకు మాసపత్రిక దోహదపడుతుందన్నారు. సంచిక ముద్రణకు సరస్వతి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ.4 వేలు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో పూర్వపు హెచ్‌ఎం లలిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గర్భిణుల ఆరోగ్యంపై అవగాహన



దిగువమోదలపల్లెలో వైద్య పరీక్షలు



గుడిపాల: వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ అనూషా

తవణంపల్లె: గర్భిణులు మంచి పోషకాహారం తీసుకుంటూ క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని తవణంపల్లె మండల వైద్యాధికారి ధాత్రేయచౌదరి అన్నారు. సోమవారం మండలంలోని ఎగువ మారేడుపల్లె, దిగువ మోదలపల్లెలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. దిగువ మోదలపల్లెలో 75 మందికి వైద్య పరీక్షలు చేశారు. ఎగువ మారేడుపల్లెలో డాక్టర్ ప్రియాంక 80 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి సూచనలు, సలహాలు ఇచ్చారు. 104 మొబైల్ క్లినిక్‌లో గర్భిణులు, బీపీ, షుగర్‌వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

ప్రతి ఇంటి వద్దకు వైద్యసేవలు

గుడిపాల: ప్రతి ఇంటి ముంగిటకు వైద్యసేవలు అందిస్తున్నట్లు డాక్టర్ అనూషా అన్నారు. శ్రీరంగంపల్లెలో సోమవారం 104 వైద్యశిబిరం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రతి ఇంటి ముంగిటకు వైద్య సేవలు తీసుకెళుతున్నట్లు తెలిపారు. మొత్తం 60 మంది రోగులకు బీపీ, షుగర్, గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. మంచం పట్టిన రోగులకు ఇంటి వద్దకే వెళ్లి వైద్య సేవలు చేశారు. వైద్య సిబ్బంది శ్రీలత, రెజ్వాన, అన్నపూర్ణ, శిరీష, శివగామి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

యాదమరి: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో 1979 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు 46 ఏళ్ల తర్వాత సోమవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఓ ఫంక్షన్ హాల్ వేదికగా జరిగిన ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు వారి కుటుంబ సభ్యులతో కలసి హాజరయ్యారు. పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుని సరదాగా గడిపారు. యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. తమకు పాఠాలు చెప్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు.

ఆచార్య గణపతి భట్‌కు సాధకశ్రీ బిరుదు

తిరుపతి సిటీ : రాష్ట్రీయ సంస్కృత విశ్వవిద్యాలయం అద్వైత వేదాంత విభాగం ఆచార్యులు గణపతి భట్‌కు సాధకశ్రీ–2023 బిరుదు లభించింది. కర్ణాటకలోని ప్రాచీన మఠం హరిహరపుర క్షేత్రం శ్రీ ఆదిశంకారాచార్య శారద లక్ష్మీనరసింహ పీఠం పీఠాధిపతులు స్వయంప్రకాశ సచ్చిదానంద సరస్వతి స్వామి తమ చతుర్మాస దీక్ష సందర్భంగా ఆదివారం బెంగళూరులో విద్వత్ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతి భట్‌కు బిరుదు అందజేసి సత్కరించారు. ఆయన న్యాయ వేదాంత జ్యోతిష్య శాస్త్రాలను ఔపోసన పట్టారు. గతంలో ఆయన కంచి, శృంగేరి, మంత్రాలయం వంటి ప్రతిష్ట మఠాల్లో జరిగిన విద్వత్ సభల్లో పాల్గొని అనేక పురస్కారాలు అందుకున్నారు.